సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 20 । మే । 2023



'సాక్షి' వ్యాసరచన పోటీలకు స్పందన

వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా 'సాక్షి' పత్రిక ఆధ్వర్యంలో నెల్లూరులో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.

IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,180
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,584
3 శాతం జీఎస్టీతో	రూ.5,751
నవర (8 గ్రా)	రూ.46,008

గరిష్టం/కనిష్టం
40.3 /29.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో 66 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నానో డీఏపీపై అవగాహన



డీఏపీ బాటిళ్లను ప్రదర్శిస్తున్న జేసీ, చైర్మన్

నెల్లూరు(పొగతోట): వ్యవసాయంలో నూతన పద్ధతులపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకున్నట్లు జేసీ ఆర్.కూర్మనాథ్ తెలిపారు. నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఇఫ్కో నానో డీఏపీపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. జేసీ మాట్లాడుతూ ధాన్యం విక్రయాల్లో రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆర్బీకేల్లో నానో డీఏపీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబు రెడ్డి మాట్లాడుతూ నానో డీఏపీతో రైతులకు పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు. సమావేశంలో ఇఫ్కో రాష్ట్ర మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, ఇఫ్కో జిల్లా అధికారి లక్ష్మీనారాయణ, ఆదర్శ రైతు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ



సమస్యలు వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన సిబ్బంది తదితరులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిక, అర్హతల ఆధారంగా బదిలీలు నిర్వహిస్తామన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు(పొగతోట): జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందన్నారు. గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ సంస్థ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, వ్యవసాయం తదితర శాఖలపై సమీక్షిస్తారన్నారు. జెడ్పీ సభ్యులు, జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.



సీఎం కార్యక్రమాన్ని తిలకిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్ తదితరులు



అవార్డులు అందుకున్న వలంటీర్లు

వలంటీర్లకు సెల్యూట్

గ్రామ, వార్డు వలంటీర్లు.. ప్రజలకు వీరు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో వీరి పాత్ర కీలకం. కోవిడ్ సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజల కోసం పనిచేశారు. ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తించి నగదు పురస్కారాలతో ఘనంగా సత్కరిస్తోంది.

- ప్రభుత్వ ఆధ్వర్యంలో సన్మానాలు
- కలెక్టరేట్‌లో పలువురికి అవార్డుల అందజేత
- సేవలను కొనియాడిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన పలువురు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డు గ్రహీతలను శుక్రవారం సన్మానించారు. వలంటీర్లకు అవార్డులు అందజేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, ఏఎస్పీ హిమవతి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు తిలకించారు. అనంతరం కొందరు వలంటీర్లను శాలువా, మెడల్, సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ నిరంతరం సేవలందిస్తున్న వలంటీర్లను ప్రతిఒక్కరూ అభినందించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లో వలంటీర్లను సత్కరిస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వలంటీర్లు ప్రజల గడప వద్దకు చేరుస్తున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ వలంటీర్లు మరింత ఉత్సాహంతో పనిచేసి మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ కనకదర్గాభవాని, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డీఆర్‌డీఏ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో..

సేవా వజ్ర గ్రహీతలు : 44 మంది
సేవా రత్నలు : 235 మంది
సేవా మిత్రలు : 11,080 మంది

సంతృప్తిగా పనిచేస్తున్నా



నేను నెల్లూరు జీనిగలవారివీధి సచివాలయం పరిధిలో శెట్టిగుంటరోడ్డు వలంటీర్‌గా పనిచేస్తున్నాను. ఈ ప్రాంతంలో ప్రజలు నిరుపేదలు. కూలి పనులు చేస్తుంటారు. వారికి ప్రతి సంక్షేమ పథకాన్ని అందజేస్తున్నాను. బీఈడీ చదువుకున్న నేను ఎంతో సంతృప్తిగా గౌరవంగా వలంటీర్‌గా పనిచేస్తున్నా.

– ఎం.ఉష,
సేవా వజ్ర పురస్కార గ్రహీత

గౌరవిస్తున్నారు



నేను బుచ్చిరెడ్డిపాళెం మినగల్లు గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్నాను. ప్రతి కుటుంబం నా పట్ల ఎంతో గౌరవం చూపిస్తోంది. ప్రతి పథకాన్ని వారికి వివరించి దరఖాస్తు చేయిస్తున్నాను. మా లాంటి పేదలకు జగనన్న అండగా ఉన్నారు. ఆయన నాయకత్వంలో మేమంతా పనిచేస్తున్నామని గర్వంగా చెబుతున్నా.

– ఎం.ప్రసన్నకుమార్, సేవా రత్న
పురస్కార గ్రహీత

అదృష్టంగా భావిస్తున్నా



నేను బీటెక్ చదివా. నెల్లూరు చాకలివీధి 44/1 సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్నా. నా పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలను అందజేసినప్పుడు వారు చూపించే ఆప్యాయత, ప్రేమ మరింత ఉత్సాహంగా పనిచేసేలా ఉంటోంది. జగనన్న ప్రభుత్వంలో నేను కూడా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా.

– ఎం.నాగలక్ష్మి,
సేవా మిత్ర పురస్కార గ్రహీత

చంద్రబాబు వ్యాఖ్యలపై జనాగ్రహం

- నెల్లూరులో ర్యాలీలు
- క్షమాపణలు చెప్పాలని డిమాండ్



వెంకటేశ్వరపురం సెంటర్‌లో ప్రజలతో కలిసి ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నెల్లూరు రూరల్ పరిధిలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా విలువైన ప్రాంతాల్లో కేటాయిస్తున్న స్థలాలను 'సెంటు భూమి సమాధులు కట్టుకోవడానికే పనికొస్తుంది.' అని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ పిలుపు మేరకు నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం 53, 54 డివిజన్లకు చెందిన నాయకులు, ప్రజలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వరపురం సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు, జనార్దనరెడ్డి కాలనీ, విజయ డెయిరీ, వెంకటేశ్వరపురం పురవీధుల్లో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నిత్యం పేదలను అవమానించేలా మాట్లాడుతున్నాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో వారు సంతోషంగా ఉన్నారన్నారు. పేదలకు ఇచ్చే స్థలాలపై బాబు అవహేళనగా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. బాబు హయాంలో ఒక్కరికీ స్థలం ఇవ్వలేదని, టిడ్కో ఇళ్లలోనూ పేదలపై రుణ భారాన్ని మోపాడని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను కించపరిచేలా మరోసారి మాట్లాడి చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని బయటపెట్టాడని విమర్శించారు. కార్యక్రమంలో 53, 54 డివిజన్ల కార్పొరేటర్లు దేవకొండ సుజాత అశోక్, సఫియా ముజీర్, కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, 53, 54 డివిజన్ల పార్టీ ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి, నాయకులు ముజీర్, బాగి వెంకటరమణ, శ్రీనివాసులురెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్: ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ పరిధిలో నాయకులు శుక్రవారం నిరసన ర్యాలీ చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించారు. రంగారెడ్డి, పాలకీర్తి రవి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గురుకులాల్లో సీట్ల కేటాయింపు

నెల్లూరు(వేదాయపాళెం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి జరిగిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు జిల్లా గురుకులాల కో–ఆర్డినేటర్ టి.హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు సమాచారం అందించామని, నిర్ధారణ చేసుకునేందుకు 23వ తేదీ వరకు గడువు విధించినట్లు తెలియజేశారు. అదే విధంగా ఐఐటీ/నీట్ మెడికల్ అకాడమీలో ప్రవేశం కోసం ఇంటర్ ఏపీజీపీసెట్ మొదటి దశ ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఈనెల 21వ తేదీన రెండో దశ ప్రవేశపరీక్షను కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్ ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు 94940 90137, 82473 58603, 98857 32146 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కమనీయం..
మల్లికార్జునుడి కల్యాణోత్సవం



కల్యాణ వేదికపై కొలువైన దేవదేవేరులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆలయం బయట ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవారిని కొలువుదీర్చారు. అనంతరం ఉభయకర్తలు పట్టువస్త్రాలను సమర్పించారు. దేవదేవేరులను నూతన వధూవరులుగా పట్టువస్త్రాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు నడుమ అర్చకులు కల్యాణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. కాగా కల్యాణోత్సవంలో భాగంగా ఎదుర్కోలు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వల్లూరు రవీంద్రకుమార్‌రెడ్డి – సంధ్య దంపతులు, శ్రీశక్తి ఆగ్రో ఆయిల్ వారు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, రఘురామయ్య, సుప్రజ, పద్మ, విజయమ్మ, విమల, కామేశ్వరి, శశిశేఖర్‌శర్మ, నాయకులు మోర్ల మురళి, ప్రేమ్‌సాగర్, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. ఒకటో యూనిట్లో 640 మెగావాట్లు, రెండులో 410, మూడో యూనిట్లో 630 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు.

సోమశిలలో 45.571 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 45.571 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 187 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,200 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి మట్టం 95.412 మీటర్లుగా ఉంది.

జ్ఞానభూమి వైబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచినట్లు ఆర్ఐఓ వరప్రసాద్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల ప్రిన్సిపల్స్ జ్ఞానభూమి వైబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారని తెలియజేశారు.

11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): మర్రిపాడు మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత వారికి 25 శాతం , బాలికలకు 33 శాతం సీట్లు కేటాయించినట్లు తెలియజేశారు. వచ్చేనెల 22న ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

క్లుప్తంగా

జామాయిల్ తోట దగ్ధం



కలిగిరి: కలిగిరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మాగుంట సుబ్బరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు సంబంధించిన జామాయిల్ తోట శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌కు ఉన్న 4.5 ఎకరాల పొలంలో జామాయిల్ సాగు చేస్తున్నారు. ఆ తోట బాధ్యతలను చూస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డికి ఈ విషయాన్ని స్థానికులు తెలపడంతో ఆయన వింజమూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో 3 ఎకరాల్లోని జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.10 లక్షల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

మానవత్వం చాటుకున్న సీఐ



వెంకటేశ్వర్లుకు వైద్యపరీక్షలు చేయిస్తున్న సీఐ రామారావు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం సీఐ రామారావు మానవత్వాన్ని చాటుకున్న ఘటన మండలంలోని జొన్నవాడలో శుక్రవారం చోటుచేసుకుంది. జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు జొన్నవాడ గిరిజనకాలనీకి చెందిన యువకుడు ఎస్.వెంకటేశ్వర్లు వచ్చాడు. కల్యాణం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను పట్టుకుని ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. సీఐ రామారావు గమనించి వెంటనే వెంకటేశ్వర్లును పోలీస్ సిబ్బంది సాయంతో తన వాహనంలో ఎక్కించుకుని జొన్నవాడలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు అహ్మద్‌బాబు, సిబ్బంది అతనికి పరీక్షలు నిర్వహించారు. మండుటెండలో ఉండడంతోపాటు అతనికి ఆరోగ్య సమస్యలు ఉండడంతో స్పృహతప్పి పడిపోయాడని వైద్యులు తెలిపారు. వెంకటేశ్వర్లును సరైన సమయంలో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి మానవత్వం చాటుకున్న సీఐను స్థానికులు అభినందించారు.

ప్రభుత్వ స్థలంలో ఎన్‌టీఆర్ విగ్రహం

ఆత్మకూరురూరల్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు స్వగ్రామమైన ఆత్మకూరు మండలం కరటంపాడులో ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని శుక్రవారం అర్ధరాత్రి ఏర్పాటు చేశారు. కరటంపాడు బస్టాండ్ సెంటర్‌లో 67వ నంబరు జాతీయ రహదారి పక్కన విగ్రహం ప్రతిష్టించినా.. పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ కరటంపాడుకు వచ్చిన సందర్భంలో ఆవిష్కరించాలని టీడీపీ నేతలు యోచిస్తున్నారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఒక బంకుతోపాటు స్థలాన్ని రూ.లక్షకు కొనుగోలు చేసి అక్కడ విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేసిన టీడీపీ నేతల తీరుపై విమర్శలు వస్తున్నాయి.

'సాక్షి' వ్యాసరచన పోటీలకు విశేష స్పందన





వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

- రత్నం స్కూల్‌లో పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు(టౌన్): వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక డైక స్‌రోడ్డులోని డా.కిషోర్స్‌రత్నం జెన్ నెక్స్ట్ స్కూల్‌లో 'సాక్షి' పత్రిక ఆధ్వర్యంలో రత్నం స్కూల్ సౌజన్యంతో విద్యార్థులకు 'హాట్ వెదర్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచన పోటీలకు రత్నం స్కూల్ నుంచి 50 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచన పోటీలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. వేసవి సెలవుల్లో 'సాక్షి' ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు, ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

పోటీలు నిర్వహించడం హర్షణీయం



'సాక్షి' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం హర్షణీయం. వేసవి సెలవుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు. సాధారణంగా ఎక్కువ రోజులు సెలవులు ఇవ్వడం వల్ల పుస్తకాలు చదవడం పూర్తిగా మానేస్తాం. – ఎస్కే నాజియా, 8వ తరగతి, లాయర్స్ కాలనీ

మెదడుకు పదును



వ్యాచరచన, వృక్తృత్వం లాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు చురుకుగా ఉంటారు. సెలవుల్లో విద్యార్థులు పుస్తకాల జోలికి వెళ్లే పరిస్థితి ఉండదు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల పుస్తకాలు చదివే అవకాశం కలుగుతుంది. – ఎస్.కరిష్మా, 9వ తరగతి, డైకస్‌రోడ్డు

విజ్ఞానం పెంపొందుతుంది



జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాలపై పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుంది. సొంతంగా రాయగలిగే శక్తి విద్యార్థుల్లో పెరుగుతుంది. పాఠశాలలు పునః ప్రారంభం వర కు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం మంచిది. – సుహానా, 7వ తరగతి, ప్రగతినగర్

శిక్షణ తరగతులు ఎంతో మేలు



వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇళ్ల వద్ద కూర్చోకుండా వారికి ఇలాంటి శిక్షణ శిబిరాలు నిర్వహించడం ఎంతో మేలు. ఖాళీ సమయంలో ఎక్కువగా సెల్‌ఫోన్లపై దృష్టి పెడుతుంటారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు పుస్తకాలను చదివే అవకాశం ఉంటుంది. – పావని, 8వ తరగతి, నేతాజీనగర్

అభినందనీయం



'సాక్షి' ఆధ్వర్యంలో ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయం. సాధారణంగా సెలవుల్లో విద్యార్థులు ఆటలకే పరిమితమవుతుంటారు. కానీ పోటీ పరీక్షలు నిర్వహించడం వల్ల పుస్తకాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. – టి.రాధాకృష్ణ, ప్రిన్సిపల్

బాధ్యతగా పని చేయించండి

- డ్వామా పీడీ వెంకట్రావు



ఆత్మకూరురూరల్: మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావు

చేజర్ల(సోమశిల): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీలతో బాధ్యతగా చేయించాలని డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం అనంతసాగరం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పనులు చేయించేటప్పుడు నాణ్యత పాటించాలని తెలిపారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు వారం రోజులపాటు మండలంలోని 25 పంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహించారని, ఆ నివేదికలోని అంశాలను చర్చించినట్లు తెలిపారు. అనంతసాగరం మండలంలో జరిగిన 566 పనులకు గాను రూ.8,83,91,473 నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.1,03,784 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ శంకర్‌నారాయణ, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎంపీపీ పి.సంపూర్ణమ్మ, ఎంపీడీఓ మధుసూదనరావు ఏపీఓ దయాసాగర్, ఎస్ఆర్పీ మురాద్, శాప్ డైరెక్టర్ కాలువ నర్సింహులు, దేవరాయపల్లి సర్పంచ్ షేక్ రమిజాబి, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట

ఆత్మకూరురూరల్: ఉపాధి హామీ పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ వంద శాతం సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. మండలంలోని వాశిలిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆత్మకూరు ఏపీడీ శంకర్ నారాయణతో కలిసి ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. కూలీలు నిర్మిస్తున్న పశువుల గుంతల వద్దకు వెళ్లి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకొనేలా ఉపాధి కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ శిరీష, టీఏ వినోద్‌కుమార్, ఉపాధి సిబ్బంది మధుసూదన్‌రావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్):	143
లేయర్ (లైవ్):	95
బ్రాయిలర్ చికెన్:	244
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	270
లేయర్ చికెన్:	162

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కమిటీలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 కార్యక్రమానికి సంబంధించి పంచాయతీల ఎంపికకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల పరిశీలనకు వెరిఫికేషన్ కమిటీ సభ్యులు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఓడీఎస్ ప్లస్ అంశాల పరంగా మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కమిటీలో ముగ్గురు సభ్యులు ఉండేలా ఏర్పాటు చేశామని, వారు ఆయా పంచాయతీల్లో పరిశీలన చేసి పూర్తి వివరాలను కేంద్ర వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు. పరిశీలన అనంతరం పంచాయతీలు పొందిన మార్కుల ఆధారంగా ఉత్తమ ప్రతిభ గల పంచాయతీలను జిల్లాస్థాయి అవార్డుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని తెలిపారు.

ఆరోగ్య సర్వే త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌బాబు



కొడవలూరు: సాధారణ, అసాధారణ(సీడీ, ఎన్‌సీడీ) వ్యాధులపై జరుగుతున్న ఆరోగ్య సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌బాబు ఆదేశించారు. మండలంలోని కమ్మపాళెం సబ్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సర్వే పూర్తయితే దాని ఆధారంగా ప్రతి ఒక్కరికీ హెల్త్‌కార్డులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. సర్వేకు అత్యంత ప్రాధాన్యం ఉన్నందున నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని తెలిపారు. అలాగే వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున తగినన్ని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వడదెబ్బకు గురై వచ్చిన వారికి సకాలంలో వైద్యం అందించేలా తగినన్ని మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఎన్‌ఎం రాధమ్మ ఉన్నారు.

నాటుబాంబు పేలి గోవుకు తీవ్రగాయాలు




గాయపడిన గోవు

వరికుంటపాడు: అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లిన గోవు గుర్తుతెలియని వ్యక్తులు మూగజీవాలను వేటాడేందుకు పెట్టిన నాటుబాంబును కొరకడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కనియంపాడు పెద్దచెరువు సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొన్ని గోవులు రోజూలాగే మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లాయి. గ్రామ సమీపంలోని పెద్దచెరువు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందులను వేటాడేందుకు చెరువు సమీపంలో పెట్టిన నాటుబాంబును పోలిబోయిన కొండయ్యకు చెందిన గోవు కొరకడంతో అది పేలి నోటికి తీవ్రగాయాలై రక్తస్రావమైంది. గోవు రక్తగాయాలతో ఇంటికి చేరుకోవడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. నాటుబాంబులు పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
శనివారం ॥ 20-5-2023

నెమలీకల టోపీ ధరించి కోలాహలంగా ఆడతారు.
రేలా... రే... రేలా అంటూ గొంతు కలిపి పాడతారు.
ప్రకృతి గురువు నేర్పిన పాఠాలకు ఆనవాళ్లు వారు.
మొన్నటి వరకు అడవి తల్లి ఒడిలో దాగిన కళారూపాలివన్నీ.
నేడవి అడవి గోడలు దాటి నగరాన్ని ఉర్రూతలూగిస్తున్నాయి.
దేశం ఎల్లలు కూడా దాటే వరకు గుస్సాడి ఆడాలంటున్నారు...
పద్మశ్రీ కనకరాజు.





గుస్సాడి గుండెచప్పుడు

పద్మశ్రీ కనకరాజు

కనకరాజు పేరులో ఇంటి పేరు కనక, ఆయన పేరు రాజు. ఇన్ని వివరాలు మాకక్కర్లేదు, గుస్సాడి నృత్యం చేస్తాడు, మా అందరి చేత అడుగు వేయిస్తాడు కాబట్టి ఆయన మాకు 'గుస్సాడి రాజు' అంటారు స్థానికులు. ఆయన పద్మశ్రీ అందుకున్నప్పటి నుంచి నాగరక ప్రపంచం ఆయన మీద దృష్టి కేంద్రీకరించింది. కనక రాజు అని ఇంటిపేరుతో కలిసి వ్యవహారంలోకి వచ్చారు. అయినప్పటికీ వారి గూడేలకు వెళ్లి కనకరాజు అని అడిగితే వెంటనే గుర్తుపట్టరు. గుస్సాడి కనకరాజు అంటే టక్కున చెప్పేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మర్లవాయి ఆయన ఊరు. ప్రస్తుతం కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, అంతేకాదు, కుమ్రుం భీమ్ వారసులు కూడా. ఆదిలాబాద్‌లో విస్తరించిన గోండ్ తెగకు చెందిన వాళ్లందరూ భీమ్ వారసులుగా గర్వంగా భావిస్తారు. ఎనభై ఏళ్ల కనకరాజు... తండ్రి చెప్పిన మాట కోసం గుస్సాడి నృత్యం పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేశారు. గుస్సాడితో మమేకమైన తన జీవితానుభవాలను సాక్షితో పంచుకున్నారాయన.

ఆట... పాట... జీవితం!

"మా ఆదివాసీల జీవనంలో ప్రకృతి, నృత్యం, గానం కలగలిసి పోయి ఉంటాయి. బిడ్డ పుడితే పాట, పెళ్లి వేడుకకీ పాట, అంతే కాదు... మనిషి పోయినా పాట రూపంలో ఆ వ్యక్తితో మా అనుబంధాన్ని గుర్తు చేసుకుంటాం. దండారీ ఉత్సవాలంటే మాకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేస్తుంది. మగపిల్లలకు నృత్యం, ఆడపిల్లలకు రేలా పాట చిన్నప్పటి నుంచే నేర్పిస్తాం. గుస్సాడి నృత్యంలో అడుగులు వేయడం ఎప్పుడు మొదలైందో నాకు గుర్తు లేదు. కానీ మా నాన్న ఒక మాట చెప్పేవారు. 'ఈ నృత్యమే మనకు దైవం. 'ఈ నృత్యాన్ని మరువద్దు. తరతరాలుగా మోసుకొస్తున్నాం. దీన్ని కాపాడుకుంటేనే దేవుడు మనల్ని కాపాడుతాడు' అని చెప్పేవాడు. ఆ మాట నాలో నాటుకుపోయింది. నాకు వయసొచ్చినప్పటి నుంచి నృత్యంలో తొలి ఆటగాడిగా అడుగులు వేస్తుండేవాణ్ని. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసించే రెండువేల గూడేలకూ నేను తెలిసిపోయాను.

గణతంత్ర వేడుక

గణతంత్ర వేడుకల్లో మా ప్రాచీన వారసత్వ కళ అయిన గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం నాకు 1982లో వచ్చింది. అప్పుడు ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మా గుస్సాడి టోపీ పెట్టించి, గజ్జెలు కట్టించాం. ఆమె మాతో అడుగులు వేసింది. ఆ తర్వాత ఓసారి అబ్దుల్ కలామ్ కూడా మాతో అడుగులు వేశారు. హైదరాబాద్‌లో ఎన్ని ప్రదర్శనలిచ్చామో లెక్కే లేదు. ఢిల్లీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో కూడా మా గుస్సాడిని ప్రదర్శించాం. మరో పది దఫాలు యువతతో చేయించాం. నాయన మాట మీద గుస్సాడి కోసం బతికినందుకే మా దేవుడు మెచ్చి గొప్ప వాళ్లకిచ్చే పద్మశ్రీని ఇప్పించాడనుకుంటున్నా.



2021లో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకుంటూ...



సంప్రదాయ వస్త్రధారణలో గుస్సాడి కనకరాజు

నెమలీకల టోపీ

మా నృత్యం సాధన చేయడమే కాదు, టోపీ, దుస్తులు, గజ్జెలు అన్నీ ప్రత్యేకమే. వాటిని తయారు చేయడానికి చాలా నైపుణ్యం ఉండాలి. పెద్ద టోపీకి రెండు వేల పింఛాలుంటాయి. మా ఇళ్లలో వాటిని భద్రపరుచుకోవడం పెద్ద పని. మా ముత్తాతలు ధరించిన టోపీ ఇంకా నేను ధరిస్తూనే ఉన్నాను. కొత్తవాళ్ల కోసం టోపీలు తయారు చేస్తున్నాం. పెద్ద టోపీ, దుస్తులతోపాటు మొత్తం వేషానికి ఇరవై వేల రూపాయలవుతాయి. మా ఆదివాసీ వ్యక్తి తుకారామ్ సాబ్ కలెక్టర్ అయిన తరవాత ఈ నృత్యానికి ఇంకా కొన్ని చేర్పులు చేసి బాగా మంచిగా చేశారు. పద్మశ్రీ వచ్చిన తర్వాత ఐటీడీఏ ఆఫీసర్లు గుస్సాడి నృత్యం నేర్పించడానికి వందకు పైగా బడులు పెట్టారు. ఒక్కో బడిలో రెండు-మూడు వందల మంది నేర్చుకుంటున్నారు. నేను పెద్ద మాస్టర్ (చీఫ్ డాన్స్ మాస్టర్)ని. గుస్సాడి, రేలా పాట నేర్పించడానికి 30 మందిని ప్రత్యేకంగా తయారు చేశాను. మరో రెండు వందల మందికి సంపూర్ణంగా శిక్షణనిచ్చాను. ఇంక మామూలుగా నేర్చుకుని ఆడే వాళ్లు ఎన్ని వేల మంది ఉన్నారో నేను ఎప్పుడూ లెక్క చెప్పుకోలేదు.

అడవి తల్లికి అందరూ ఒక్కటే!

మా ఆదివాసీల్లో మగపిల్లాడు ఎక్కువ, ఆడపిల్ల తక్కువనే ఆలోచనే ఉండదు. బిడ్డలంతా సమమే. పెళ్లిలో కట్నకానుకలు ఉండవు. ఆడబిడ్డ పుట్టిందని చింతపడడం మాకు తెలియదు. నాకు ఎనిమిది మంది కూతుళ్లు, ముగ్గురు కొడుకులు. బతకడానికి ఆశ్రమ పాఠశాలలో రోజు కూలీగా పని చేస్తూ కూడా అందరికీ చదువు చెప్పించాను. తొమ్మిది- పది తరగతుల వరకు అందరూ చదువుకున్నారు. రెండో కొడుకు వెంకటేశ్ మాత్రం డిగ్రీ చదివి టీచర్ ఉద్యోగం చేస్తున్నాడు. తరతరాలుగా అడవులకే పరిమితమైపోయిన గుస్సాడి నృత్యాన్ని నేను దేశానికి తెలియ చెప్పాను. మీరు మన ఆట, పాటలను ఇతర దేశాలకు తీసుకెళ్లాలని నా పిల్లలు, శిష్యులకు చెబుతున్నాను" అని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు గుస్సాడి కనకరాజు.

– వాకా మంజులారెడ్డి

సందర్భం

స్కూల్ రోజుల్లో నియతికి లెక్కలు అంటే లెక్కలేనంత భయం.
ఇప్పుడు ఆమెకు వ్యాపార లెక్కలు కొట్టిన పిండి.
అప్పట్లో సైన్స్ సబ్జెక్ట్ పేరు వినబడగానే ముఖం తిప్పుకునేది చిన్నారి నియతి.
ఇప్పుడు ఆమెకు వంటల శాస్త్రం లోతుపాతులు బాగా తెలుసు.
చిన్న వయసులోనే 'స్టార్ చెఫ్'గా పేరు తెచ్చుకున్న
ముంబైకి చెందిన **నియతిరావు** 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా-2023'
జాబితాలో చోటు సంపాదించింది...

సాహో రే స్టార్ చెఫ్



నియతిరావు

చిన్నప్పుడు నియతిరావు బడి అంటే భయపడేది. లెక్కలు, సైన్స్ అంటే చాలు ఆమెకు వణుకు వచ్చేది. అలాంటి నియతికి అమ్మ, అమ్మమ్మలు చేసే వంటలు అంటే ఇష్టం. వాళ్లు వంటలు చేస్తుంటే ఆసక్తిగా గమనించేది.

తల్లి గుజరాతీ. తండ్రి దక్షిణ భారతం. దీంతో అటు వంటకాలు ఇటు, ఇటు వంటకాలు అటూ వెళ్లేవి. వంటలను అమితంగా ప్రేమించే ఆ ఇంట్లో ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేకుండా ఎన్నో వంటకాలు చవులూరించేవి. 'తినరా మైమరిచి' అని ఆప్యాయంగా పిలుస్తుండేవి.

'అదృష్టాన్ని నమ్ముకోకుండా ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోండి, అద్భుత ఫలితాన్ని సొంతం చేసుకోండి' అనే మాటను ఎన్నోసార్లు విన్న నియతి తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని చెఫ్‌గా మారింది.

కోపెన్‌హెగన్(డెన్మార్క్)లో వరల్డ్ ఫేమస్ రెస్టారెంట్ నోమాలో ఇంటర్న్‌షిప్ తరువాత తిరిగి ముంబైకి వచ్చింది.

'ఇప్పుడు ఏ వ్యాపారమైనా రిస్క్' అనుకునే సమయం అది.

అలాంటి సమయంలో 'ఎక్కా' రెస్టారెంట్ ప్రారంభించడానికి రెడీ అయింది. ప్రాజెక్ట్ పట్టాలెక్కుతున్న సమయంలో ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేశారు.

'కొన్ని సమయాల్లో డబ్బు కంటే మన మీద మనకు నమ్మకం చాలా అవసరం' అంటున్న నియతి ఆరోజు ధైర్యాన్ని కోల్పోయి ఉంటే, 'ఇక చేసేదేమీ లేదు' అనే నిర్లిప్తతకు గురై ఉంటే 'స్టార్ చెఫ్'గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేది కాదు.

కొత్త ఇన్వెస్టర్‌లను ఒప్పించడానికి ఎంత కష్టపడిందో తెలియదుగానీ మొత్తానికైతే 'ఎక్కా' రెస్టారెంట్ కలను సాకారం చేసుకుంది.

పద్నాలుగు నెలల వ్యవధిలోనే 'ఎక్కా' ఆసియాలోని అత్యుత్తమ రెస్టారెంట్‌ల జాబితాలో చోటు సంపాదించింది.

నేను తెలుసుకున్న సత్యం





వంటకం అంటే ఆకలి తీర్చుకోవడం, రుచులను ఆస్వాదించడానికే పరిమితమైనది కాదు. అది మన సంస్కృతి. మనం పరస్పరం ఇచ్చుకునే గౌరవం. తరం నుంచి తరానికి మధ్య కదిలే జ్ఞాపకం. గత దశాబ్ద కాలంలో నేను నేర్చుకున్న ఏకైక విషయం... మన భారతీయ వంటకాలు ఎంతో గొప్పవి అని. వాటికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది అని. మన వంటకాలలో ఉపయోగించే దినుసులపై ప్రత్యేకంగా దృష్టి పెడితే ఎన్నో కాంబినేషన్‌లు, టెక్నిక్స్ గురించి తెలుసుకోవచ్చు, కొత్త రుచులను ఆస్వాదించవచ్చు.

– నియతిరావు

ఈ ఘన విజయానికి కారణం ఏమిటి?

'మెనూ చూడగానే నోరూరడం మాత్రమే కాదు, పాత జ్ఞాపకాలు మదిలో నిండి పోవాలి. ఆ రోజుల్లో మా అమ్మ ఈ వంటకాన్ని అలా చేసేది. ఎంత బాగుండేదో కదా!... ఇలాంటి జ్ఞాపకాలెన్నో దృశ్యాలై కళ్లముందు నిలవాలి' అంటున్న నియతి తన రెస్టారెంట్‌ను ఆషామాషీగా ప్రారంభించలేదు.

ఎంతో గ్రౌండ్ వర్క్ చేసింది.

ఎన్నోచోట్ల సర్వే చేసి కస్టమర్‌ల అభిప్రాయాలను, అభిరుచులను తెలుసుకుంది.

ఏ రెస్టారెంట్ ఎందుకు సక్సెస్ అయింది? ఎందుకు అట్టర్ ఫ్లాప్ అయింది? తెలుసుకోవడానికి కేస్‌స్టడీ చేసింది.

వాటన్నిటినీ ఒక దగ్గర జోడించి, దానికి రుచి జత చేసి పక్కా ప్లాన్‌తో 'ఎక్కా' మొదలుపెట్టింది.

'నేను నేర్చుకున్నాను' అనేవారు ఒక రకం.

'నేను నేర్చుకుంటూనే ఉంటాను' అనేవారు రెండో రకం.

నియతి రెండో రకం.

'భారతీయ వంటకాలలో ఉపయోగించే దినుసులు వేటికవే ప్రత్యేకమైనవి. వాటి ఘుమఘుమలు మరో లోకంలోకి తీసుకువెళతాయి' అంటున్న నియతి దినుసులతో కొత్త ప్రయోగాలు చేస్తూ, కొత్త రుచులను పరిచయం చేస్తుంటుంది.

'ఎక్కా' నిర్వహిస్తున్న బిల్డింగ్‌లోనే 'కేయంసీ' అనే కమ్యూనిటీ స్పేస్‌ను లాంచ్ చేసింది నియతి. 'కేయంసీ' అనేది సృజనాత్మక వంటల ఎగ్జిబిషన్. వాటి గురించి వివరంగా మాట్లాడుకునే చర్చా వేదిక.

'నియతి భవిష్యత్ దార్శనికురాలు. నిత్యప్రయోగశీలి. తన చురుకుదనంతో టీమ్ మెంబర్స్‌లో ఉత్సాహం నింపుతుంది. ప్రతిభ, నాయకత్వ సామర్థ్యం ఉన్న నియతి చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది' అంటున్నారు 'ఎక్కా' ఫస్ట్ ఇన్వెస్టర్ శిల్ప లక్ష్మీనారాయణ్.

'రెస్టారెంట్ అంటే రుచుల సమ్మేళనం మాత్రమే కాదు దానికి సామాజిక బాధ్యత కూడా ఉంది' అంటున్న 28 సంవత్సరాల నియతిరావు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

కొత్త దారి

ఆ కట్టుబడికి తరించేను గుర్రపుడెక్క జన్మ!

25 కిలోల గుర్రపు డెక్క నుంచి ఒక ఫ్యూజన్ చీర తయారు చేయవచ్చు.

'గుర్రపు డెక్కతో సమస్యలు ఇన్నిన్ని కాదయా' అనే విషయం మనకు తెలియనిదేమీ కాదు. నీటివనరుల పాలిట శత్రువుగా పరిగణించే గుర్రపు డెక్క నుంచి అందమైన చీరలు తయారు చేస్తూ 'ఆహా' అనిపిస్తున్నాడు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ గౌరవ్ ఆనంద్...

జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందిన గౌరవ్ ఆనంద్ టాటా స్టీల్‌లో పనిచేస్తున్న రోజుల్లో నదుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ సమయంలో నదులలో దట్టంగా పేరుకు పోయిన గుర్రపు డెక్క అతడి దృష్టిలో పడేది.

'దరిద్రపు మొక్కలు' అని దాన్ని గురించి ప్రజలు తిట్టుకోవడాన్ని ఎన్నోసార్లు విన్నాడు.

'క్లీన్ రివర్ గంగా' మిషన్‌లో పాల్గొన్న తరువాత ప్రతివారం ఎక్కడో ఒకచోట నదులు, కాలువలు, చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనేవాడు.

'నది లేదా చెరువులు, కాలువలను ఒకసారి గుర్తు తెచ్చుకుంటే నీళ్లు కాదు గుర్రపుడెక్క మాత్రమే కళ్ల ముందుకు వచ్చేది' అంటాడు గౌరవ్.

జలవనరుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో మరింత విస్తృతంగా పాల్గొనడానికి కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి 'స్వచ్ఛత' అనే ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టాడు గౌరవ్. ఒకవైపు పర్యావరణ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు గుర్రపు డెక్కపై ప్రయోగాలు చేసేవాడు.

మొదట్లో...

గుర్రపు డెక్కను ఉపయోగించి ల్యాంప్ షెడ్స్, పేపర్లు, నోట్‌బుక్‌లు, మ్యాట్‌లు... మొదలైనవి తయారు చేసేవాడు. ఆ సమయంలో 'ఇంకా ఏం చేయలేమా?' అని మేధోమథనం చేస్తున్న క్రమంలో పుట్టిన ఆలోచనే... గుర్రపు డెక్క నుంచి చీర. ఇలాంటి చీర ప్రపంచంలోనే మొదటిది. అయితే 'గుర్రపు డెక్క నుంచి చీర' అనేది అంత సులువైన పని కాదు. ఎంతో ఓపిక ఉండాలి.

కాండాలను వారం రోజులపాటు ఎండ బెట్టడం, హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ద్వారా గుజ్జు నుంచి క్రిములను తొలగించడం, ఆ తరువాత దారం తయారు చేయడం పెద్ద పనే. అయితే గౌరవ్ ఎక్కడా డీలా పడలేదు. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం అలవాటు చేసుకున్నాడు.

ఈ ఏడాది చివరి కల్లా 1000 చీరెలను తయారు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు గౌరవ్.

పనికిరాని గుర్రపు డెక్క నుంచి అందమైన చీరెలను తయారు చేయడం ఒక కోణం అయితే గుర్రపు డెక్కను సేకరించి అమ్ముకోవడం ద్వారా ఎంతోమంది మహిళలు ఉపాధి పొందడం అనేది మరో కోణం.





నలభై ఏడు సంవత్సరాల రమ్యకు భర్త చనిపోయాడు. ఆమె ఒక పొగాకు ఫ్యాక్టరీలో తక్కువ జీతానికి పనిచేసేది. ఆరోగ్యం దెబ్బ తినడంతో ఉద్యోగం మానేసింది. గుర్రపు డెక్క సేకరణ ద్వారా రమ్య ఉపాధి పొందుతోంది.

'రోజుకు రెండు నుంచి మూడు గంటలు కష్టపడితే చాలు' అంటుంది రమ్య.

ప్రస్తుతం జంషెడ్‌పూర్ (జార్ఖండ్), ఖరగ్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఈ చీరెలను అమ్ముతున్నారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని ధరలు నిర్ణయించారు.

'చీరెల ద్వారా లాభాలు గడించాలనేది నా లక్ష్యం కాదు. చేనేత కార్మికుల ఆర్థిక స్థాయి మెరుగుపడాలనేది నా కోరిక' అంటున్నాడు గౌరవ్ ఆనంద్.

'చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పుడు అంతూపొంతూ లేని గుర్రపు డెక్కను చూసి బాగా కోపం వచ్చేది. తిట్టుకునేదాన్ని కూడా. ఇప్పుడు అది అపురూపంగా కనిపిస్తోంది. ఉపయోగించుకుంటే ఏదైనా ఉపయోగమే' అంటుంది పర్యావరణ కార్యకర్త నళిని.

ఇప్పుడు తన ఫేవరెట్ చీర... గుర్రపు డెక్క నుంచి తయారుచేసిన ఫ్యూజన్ చీర!

* న్యూ బిజినెస్

ఫేస్ యోగా విత్ ఆయిల్స్



బ్యూటీ ప్రొడక్ట్స్‌తో అరోరా

తనకు వచ్చిన కష్టాన్ని తలుచుకుంటూ కుంగిపోలేదు విభూతి అరోరా. నిరాశగా అనిపించే రోజులనే అవకాశాలుగా మార్చుకొని నేడు సౌందర్య ఉత్పత్తుల వ్యాపారంలో అగ్రగామిగా నిలిచింది. దానికి ముందు అనుభవించిన శారీరక, మానసిక బాధ దానిని ఎదుర్కొన్న పరిణామాలను వివరిస్తుంది ఈ గురుగ్రామ్ వాసి.

"నాకు పాతికేళ్ల వయసులో చర్మానికి సంబంధించిన 'లూపస్' అనే ఆటో ఇమ్యూన్ సమస్య వచ్చింది. ముఖం అంతా దద్దుర్లు వచ్చాయి. చర్మం పగిలి రక్తం కారుతుండేది. ఈ పరిస్థితి ఎంత భయంకరంగా ఉండేదంటే నా రూమ్ దాటి బయటకు వచ్చేదాన్నే కాదు. నా ముఖం ఎవరూ చూడకూడదని లోపలే ఉండిపోయేదాన్ని. రోజంతా ఏడుస్తూ నిద్రపోయేదాన్ని. ఎవరిలోనూ కలవకపోవడం వల్ల నా బంధుమిత్రులకు వ్యతిరేకిని కూడా అయ్యాను. కొన్ని రోజులకు ఒంటరితనంతో నాకు పిచ్చిపడుతుందేమో అనిపించేది.

పెళ్ళిని వదిలేసి..

ఇంతలో మా ఫ్రెండ్ పెళ్లికి రమ్మని ఆహ్వాన పత్రిక వచ్చింది. చాలా సంతోషం అనిపించింది నా స్నేహితులందరినీ కలవచ్చని. ఒక రోజు ముందే ఆ పెళ్లికి వెళ్లాను. డాక్టర్ చెప్పిన మందులను ఆ రాత్రి వేసుకున్నాను. మొత్తం రియాక్షన్ వచ్చింది. ముఖంతో పాటు శరీరం అంతా దద్దుర్లు. దీంతో పెళ్లిలో ఎవరినీ కలవకుండానే ఇంటికి తిరిగివచ్చేశాను. మళ్లీ డాక్టర్ని కలిశాను కానీ, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

అమ్మమ్మ చిట్కాతో...

ఏం తింటున్నాను, ఏం షాంపూ, ఫేస్ వాష్ ఏది వాడుతున్నాను అనేవి మళ్లీ మళ్లీ చెక్ చేసుకున్నాను. ఎందువల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందో నాకు అర్థం కాలేదు. చాలామంది వైద్యులను సంప్రదించాను. కానీ, నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఒకరోజు మా అమ్మమ్మ సూచించిన ఇంటి చిట్కాను ఉపయోగించడం మొదలుపెట్టాను. దేశీ నెయ్యితో ముఖానికి మసాజ్ చేయడం ప్రారంభించాను. దాంతోపాటు కొద్దిగా ఫేస్ యోగా చేయడం మొదలుపెట్టాను. మెల్ల మెల్లగా ఆ ప్రభావం నాకు తెలిసి వచ్చింది. దాదాపు పదేళ్లుగా పోరాడుతున్న సమస్యకు ఉపశమనం లభించింది.

కొత్త ఉత్పత్తి

దేశీ ఆవు నెయ్యి నాకు అమోఘంగా పని చేసింది. దీంతోపాటు ఫేస్ యోగాతో నా చర్మ సమస్యకు పరిష్కారం లభించింది. అంతే, ఇక నా ప్రయోగాలు మొదలయ్యాయి. ఆయుర్వేద నూనెలు, ఫేస్ యోగాతో అనుసంధానిస్తూ ఒక కొత్త ఉత్పత్తిని తయారు చేయడం మొదలుపెట్టాను. అలా, నాలుగేళ్ల క్రితం 'హౌస్ ఆఫ్ బ్యూటీ' మొదలైంది.

సెల్ఫ్ డిజైన్ ఫేస్ యోగా

రుగ్వేదంలో ముఖానికి 8 యోగాసనాలు ఉన్నాయి. నాకు అనారోగ్యం వచ్చినప్పుడు దాదాపు 80 ముఖ యోగా భంగిమలు చేశాను. దీంతో తేలికపాటి మచ్చలు కూడా తగ్గిపోయాయి. దాని ప్రభావం నా ముఖంపై కనిపించినప్పుడు మా కుటుంబ సభ్యులు, స్నేహితులు అడగడం మొదలుపెట్టారు. ఆ తర్వాత మాకు కూడా ఫేస్ యోగాను నేర్పించండి అని తెలిసినవారు అడుగుతుండేవారు. దీంతో ముఖం కోసం 80 యోగాసనాలతో కూడిన కోర్సును డిజైన్ చేసి, ఉత్పత్తులతో సహా మార్కెట్‌లోకి విడుదల చేశాను. మొదట జనం దీనిని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, వాడి, ఆ ఫలితాన్ని అనుభవించిన వాళ్లు నా క్లాస్‌కి రావడం, వాళ్ల ద్వారా మరికొంతమంది చేరడం మొదలుపెట్టారు. మెల్ల మెల్లగా ఫేస్‌యోగా ప్రజాదరణ పొందింది.





సౌందర్య ఉత్పత్తులు

దేశీనెయ్యి, బాదం నూనెతో మసాజ్ ఆయిల్స్ తయారు చేశాను. రసాయనాలు లేని, అన్ని రకాల చర్మ తత్త్వాలకు సరిపోయే వివిధ సౌందర్య ఉత్పత్తులను తయారు చేశాను. ఏ రసాయనాలు లేని ఉత్పత్తులు వాడటం వల్ల ఎలాంటి చర్మ సమస్యలూ తలెత్తవు. అయితే, అది అంత తేలికైన పనికాదని కొన్ని రోజులకే అర్థమైంది. ఇప్పటికే ఎన్నో బ్యూటీప్రొడక్ట్స్ మార్కెట్‌ని ఏలుతున్నాయి. నా సొంత ఆలోచనతో పనిచేయడానికి చాలా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. రసాయన రహిత ఉత్పత్తుల షెల్ఫ్ కాలం రెండేళ్లు మాత్రమే ఉంటుంది. కాబట్టి, అమ్మడం కష్టంగా ఉండేది. బ్యూటీప్రొడక్ట్స్ మార్కెట్ చేసే వాళ్లు నా ప్రొడక్ట్స్‌ని తీసుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో నా వ్యాపారానికి చాలా ప్రతిబంధకాలు ఉన్నాయని అని అర్థమైంది.

ఫేస్‌యోగా విత్ బ్యూటీ ప్రొడక్ట్

కానీ, నేడు అలియాభట్, మలైకా అరోరా వంటి సెలబ్రిటీలు నా ఉత్పత్తులు కొనుగోలు చేయడం, వాళ్లు నా ఫేస్ మసాజ్ టూల్‌తో మా ప్రొడక్ట్స్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో చాలా విజయం సాధించాను అనిపించింది. ఇది నాకు ఉచితంగా లభించిన ప్రమోషన్. దీంతో నా ఉత్పత్తులకు మరింత ప్రజాదరణ లభించింది. నాలుగేళ్లలోనే నా ప్రొడక్ట్స్ సెలబ్రిటీలు ఉపయోగించే దశకు చేరుకుంది. దీంతో నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడి నాకు నేనుగా నిలదొక్కుకోవడానికి చేసిన కృషిలో మా కుటుంబ విజయం కూడా దాగుంది' అని వివరిస్తుంది అరోరా.